ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-11-2026 సమయం: సాయంకాలం 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ ను భారతదేశ తూర్పు సముద్ర వాణిజ్య ముఖద్వారంగా తీర్చిదిద్దుతామని కేంద్రమంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు.
- ❖ మహిళలు కేవలం స్వయం ఉపాధికే పరిమితం కాకుండా.. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు.
- ❖ విమానయాన రంగంలో ఆంధ్రప్రదేశ్ అసాధారణ పురోగతి సాధిస్తోందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.
- ❖ గ్రీన్ ఎనర్జీ ద్వారా డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలను తీరుస్తామని మంత్రి నారా లోకేశ్ చెప్పారు.

==========

ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయిలో పోటీపడగల సముద్ర వాణిజ్య, రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు భారత తూర్పు, మధ్య ప్రాంతాల ప్రధాన ముఖద్వారంగా మలచాలనే స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని కేంద్ర ఓడరేవులు, నౌకాయాన, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ తెలిపారు. విశాఖపట్నంలో జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026లో ఆయన ఈరోజు ముఖ్యోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న వ్యూహాత్మక అనుకూలతలను వివరిస్తూ.. బంగాళాఖాతం వెంబడి సుమారు 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం రాష్ట్రానికి ప్రధాన బలమని సర్బానంద వ్యాఖ్యానించారు. భారత్‌ను తూర్పు, ఆగ్నేయాసియా దేశాలతో పాటు విస్తృత ఇండో-పసిఫిక్ ప్రాంతంతో అనుసంధానించే కీలక అంతర్జాతీయ నౌకాయాన మార్గాలకు రాష్ట్రం సమీపంలో ఉందని తెలిపారు. విశాఖపట్నం పోర్టు సాధిస్తున్న ప్రగతిని కేంద్రమంత్రి ప్రస్తావిస్తూ... 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ పోర్టు రికార్డు స్థాయిలో 91.17 మిలియన్ టన్నుల సరుకు లోడింగ్ / అనలోడింగ్ నిర్వహించిందని, దాదాపు 10 శాతం వృద్ధిని నమోదు చేసిందని తెలిపారు. పోర్టు సామర్థ్యాన్ని మరింత విస్తరించడం, వ్యాపార నిర్వహణ సౌలభ్యాన్ని

మెరుగుపరచడం, ఉపాధి అవకాశాలను పెంపొందించడం లక్ష్యంగా విశాఖపట్నం పోర్టులో దాదాపు 600 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసినట్లు సర్బానంద సోనోవాల్ వివరించారు.

==========

ఆంధ్రప్రదేశ్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలు సాధించిన విజయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో కోటీ 13 లక్షల మంది మహిళలు స్వయం సహాయక సంఘాల సభ్యులుగా ఉన్నారని, ఈ సంఘాల వద్ద 30 వేల కోట్ల రూపాయల కార్పస్ ఫండ్ ఉందని తెలిపారు. ప్రస్తుతం ఈ సంఘాలు దాదాపు లక్ష కోట్ల రూపాయల టర్నోవర్ సాధిస్తున్నాయని వెల్లడించారు. డ్వాక్రా మహిళలు తాము తీసుకున్న రుణాల్లో 99.6 శాతం తిరిగి చెల్లిస్తున్నారని, మహిళలకు ఆర్థిక క్రమశిక్షణ, వ్యాపార నిర్వహణ సామర్థ్యం ఎంతగా ఉన్నాయో ఇది తెలియజేస్తోందన్నారు. మహిళల వద్ద 10 రూపాయలు ఉంటే దానిని 100 రూపాయలుగా మార్చగల వ్యాపార నైపుణ్యం వారిలో ఉందని వ్యాఖ్యానించారు. స్వయం ఏపీ బ్రాండ్‌తో మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. మహిళలు కేవలం స్వయం ఉపాధికే పరిమితం కాకుండా, పెద్దఎత్తున పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

విమానయాన రంగంలో ఆంధ్రప్రదేశ్ అసాధారణ పురోగతి సాధిస్తోందని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. భారత పౌర విమానయాన రంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని, పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన పౌర విమానం మరో రెండేళ్లలో గగనతలంలోకి ప్రవేశించనుందని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. విశాఖపట్నంలో ఈరోజు జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా నిర్వహించిన ప్రత్యేక ప్లీనరీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ పౌర విమానయాన రంగంలో వేగంగా పురోగమిస్తోందని కేంద్రమంత్రి ప్రశంసించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్ణీత గడువు కంటే ఆరు నెలల ముందుగానే నిర్మాణ పనులు పూర్తి చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలోని లేపాక్షి సమీపంలో ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ సిటీ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

==========

ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని, క్లీన్ ఎనర్జీ రంగంలో సౌదీ అరేబియాలాగా.. ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా 'భారతదేశ ఇంధన భవిష్యత్ కు ఊతమివ్వడం : పునరుత్పాదక ఇంధన వనరులు, గ్రీన్ హైడ్రోజన్' అంశంపై జరిగిన ప్రత్యేక ప్లీనరీ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవన విద్యుత్, సౌర విద్యుత్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా క్లీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడమే కాకుండా, ఆ విద్యుత్‌ను గ్రీన్ మాలిక్యూల్స్ రూపంలోకి మార్చి ప్రపంచవ్యాప్తంగా సరఫరా చేయడంతో పాటు, దేశీయంగా మన ఇంధన అవసరాలను కూడా తీర్చగలగాలని ఆకాంక్షించారు. గత ఏడాది కాలంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వినియోగం దాదాపు 30 శాతం పెరిగిందని చెప్పారు. డేటా సెంటర్లు కూడా రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్నాయని, దీంతో 2028 నాటికి రాష్ట్ర విద్యుత్ అవసరాలు దాదాపు రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. అయితే గ్రీన్ ఎనర్జీ ద్వారా డేటా సెంటర్ల విద్యుత్ అవసరాలను తీరుస్తామని మంత్రి లోకేష్ చెప్పారు.

విరామం

==========

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూలమైన ప్రాంతమని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఆంధ్రప్రదేశ్ బలమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు పవన్ కళ్యాణ్ పేర్కొంటూ...

(వాయిస్ 22 సెకన్లు)

==========

విశాఖ వేదికగా జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర పర్యాటక శాఖకు సంబంధించి 1,114.92 కోట్ల రూపాయల పెట్టుబడితో 12 ఎంఓయూలు కుదిరాయి. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఆయా శాఖల కార్యదర్శుల సమక్షంలో ఈ ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. గత అక్టోబర్ లో విశాఖపట్టణం, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలలో నిర్వహించిన 5 ప్రాంతీయ సదస్సుల్లో మొత్తం 6,172.38 కోట్ల రూపాయల విలువైన 50 ఎంఓయూలు కుదిరాయని ఆ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. నేటి ఒప్పందాలతో కలిపి మొత్తంగా 7 వేల 287 కోట్ల రూపాయల పెట్టుబడితో కూడిన 62 ఎంవోయూల ద్వారా ఆతిధ్యర్యంగానికి సంబంధించి 5 వేల 155 గదుల ఏర్పాటు కాబోతున్నాయని, దీంతో 46 వేల 853 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

==========

అంతర్జాతీయ స్థాయిలో భౌగోళిక రాజకీయ అనిశ్చితి, వాణిజ్య అడ్డంకులు ఎదురవుతున్న ప్రస్తుత తరుణంలో.. ప్రపంచ సరఫరా గొలుసుని పునర్ నిర్మించడంలో కీలక పాత్ర పోషించేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని రాష్ట్ర మౌలిక సదుపాయాలు,పెట్టుబడుల శాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. అంతర్జాతీయ వాణిజ్య సదస్సులో భాగంగా `రివైరింగ్ గ్లోబల్ ట్రేడ్: సప్లై చైన్స్, మారిటైమ్ కారిడార్స్, లాజిస్టిక్స్ అండ్ ఎకనామిక్ రెసిలియన్స్` అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చాగోష్టిలో ఆయన ప్యానలిస్టుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వ్యూహాలను, సాధించిన ప్రగతిని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 970 కిలో మీటర్లుపైగా తీరప్రాంతాన్ని ఉపయోగించుకుని పోర్టులు, పరిశ్రమలు, లాజిస్టిక్స్, పట్టణాభివృద్ధి, ఇంధన రంగాలను అనుసంధానిస్తూ ఒక సమగ్ర ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 6 పోర్టులు కార్యకలాపాలు సాగిస్తుండగా.. మరో 4 కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయని, వీటిలో 3 పోర్టులు రాబోయే 6 నెలల్లో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. భవిష్యత్‌లో తీరప్రాంతంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు ఉండేలా ప్రణాళికలు రూపొందించామని, తద్వారా ఆంధ్రప్రదేశ్ ఒక వికేంద్రీకృత సముద్ర ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తోందనని చెప్పారు.

==========

స్వచ్ఛ సర్వేక్షణ్ జాతీయ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరోసారి సత్తా చాటిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సీఐఐ సమ్మిట్ ప్రాంగణంలోని మీడియా పాయింట్ వద్ద ఈరోజు ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ప్రకటించిన 60 అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్‌కు 6 అవార్డులు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యంగా 10 లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన నగరాల విభాగంలో విశాఖపట్నం దేశంలోనే మొదటి స్థానాన్ని సాధించడం విశేషమన్నారు.

==========
==========